# నాగమ్మ నవ్వింది

అల్పజ్ఞుని గంభీరోపన్యాసంలా - మార్చినెలలోనే ఎండ మండిపోతూంది

"చైత్రం రానే రాలేదింకా - ఎండేమో దండిగైపాయె" నంగునూరు బస్సుదిగి గొణుక్కుంది నాగమ్మ. అరవై వసంతాలను అరమరికలు లేకుండా దాటేసిన వయోభారాన్ని మోస్తూ బస్టాండు దాటింది. నుదుటి అనుభవ రేఖల మధ్య రూపాయి కాసంత కుంకుమ బొట్టు సూర్యకిరణాలు సూటిగా పడి ఐదురాళ్ళ ముక్కుపుడక పంచరంగుల చిత్రంగా మారింది మొహానికి సాయపసుపు రాసుకుందేమో అచ్చం అమ్మవారి లాగుంది.

అలవోకగా అడుగులేస్తూ ఆరుతోవల సెంటర్ దాటింది సుభాష్ రోడ్డు మీద వచ్చీపోయే జనాలు విచిత్రంగా కనబడుతున్నారు. ఎలుకల వేటలో పిల్లుల్లా - బస్టాండ్ నుండే వెంబడిస్తున్న బలరాం, యాదగిరిలు మొహాలు చూచుకున్నారు వాళ్లిద్దరి ఫోటోలు బస్‌స్టేషన్‌లో అతికించిన జేబుదొంగల జాబితాలో ప్రముఖంగా చోటుచేసుకున్నై. పళ్ళికిలించి కళ్లతో మాట్లాడుకున్నారు.

"అయ్యోపాపం పెద్దమ్మా! ఆయాసమొస్తుందా?" బలరాం చల్లని పలకరింపు

"అరెరే! గింత ఎండల.. కాళ్లకు చెప్పుల్లేవు. కండ్లకు అద్దాల్లేవు. ఏంపని మీదొచ్చినమ్ పెద్దమ్మా?" యాదగిరి సానుభూతి.

"గాంధీనగర్ల నా మనుమరాలుంది. చూసిపోవాలని వచ్చిన బిడ్డా!" ఇద్దర్నీ కలియజూసి కనురెప్పలమీది చెమటను కొంగుతో అద్దుకుంది చేతికున్న రవ్వల గాజులు తళుక్కుమన్నై. రెండుజతల కళ్లు చెమక్కుమన్నై.

"గవ్వేం గాజులు పెద్దమ్మా! బొగ్గులోలే నల్లవడిపోయినై!"

"ఔన్నాయనా! ఇవి పాతపడిపోయినై సొక్కం బంగారం . వీటిని అమ్మేసి కొత్త నగ చేయించుకుంటే బాగుంటుది కానీ గా బంగారం సంగతులు నాకేం దెలుస్తయ్ "

"నిజమే పెద్దమ్మా ఇంగో... ఇటు జూడు!" యాదగిరి చేతిలో మూడువరసల ముత్యాలహారం. కళ్ళు జిగేల్మన్నై.

"ఆహా! బంగారంది గదా! శానా బాగుంది బిడ్డా!" ముడతల బారిన మొహం మువ్వన్నెల ఝండాలా విచ్చుకుంది"

లారీ ఒకటి రాక్షసిలా అరుస్తూ వెళ్లిపోయింది అటోరిక్షా ఎదురోచ్చింది.

"ఎన్ని తులాలుంటదో!"

"మూడు తులాల బంగారం, రెండు తులాల ముత్యాలు. నిన్ననే చేయించినం పెద్దమ్మా! మా అమ్మకోనం కష్టపడి చేయించినం."

"నా గాజులు గూడా మూడు తులాలే. ప్చ్.... ఏం లాభం! పీటి బదులు గసొంటి హారమున్నా బాగుండేది" పెదాలు చప్పరించింది.

"అరేయ్ యాద్గిరీ! గీ పెద్దమ్మ మనమ్మ లెక్కనే ఉంది గదరా! పాపం, చానా మంచి మనిషిరా!" బలరాం విచార సాగరములో మునిగాడు.

"ఔనన్నా! మరి గీహారం ఈ పెద్దమ్మకిచ్చి ఆ గాజులు దీస్కుని మనమ్మకిద్దామా! ఈమె గూడా మన కన్నతల్లనుకుందాం!" కండలు పెంచిన యాదగిరి గుండె కరిగి నీరైనట్టుంది.

"ఆ... నిజమా బిడ్డా!" నాగమ్మ కాళ్లకు బ్రేకులు కడినై. కళ్లల్లో ఆశ తొంగి చూచింది.

"నిజమే పెద్దమ్మా! మేము నీకు సాయం జేస్తే దేవుడు మాకు సాయం జేస్తడు గదా!"

పక్కనున్న పటేల్‌పురా సందులో గాజులు, హారము చేతులు మారినై నాగమ్మ నవ్వుతూ వెళ్లిపోయింది

"హమ్మ! ముసల్డి జల్ది బుట్టల వడ్డదిరా!" యాదగిరి చంకలెగిరి పడినై.

'వెండి గొలుసుకు బంగారుపూత పూయించినం గదా! ఆ హారన్ని బ్రహ్మదేవుడు గూడా గుర్తుపట్టడు. పద మార్వాడీకమ్మేద్దా మీ గాజులు హబ్బా! పాత బంగారం .. సొక్కం బంగారంరా!"

* * * * *

"మా అమ్మ దవాఖానలుంది సేఠ్‌జీ. మందులకు పైసల్లేవు. అందుకని అమ్ముతున్నం" బ్రహ్మడండా బాధపడ్డారిద్దరూ.

గాజుల్ని అటుతిప్పి, ఇటుతిప్పి, రాయిమీద రాసి పరీక్షలు పూర్తి చేశాడు మార్వాడి.

"డబ్బు తెప్పిస్తా బైఠో...." లోపలికెళ్ళి రెండు నిముషాల్లో మచ్చాడు. "మావోడిని బాంకుకు పంపిన." అని మాటల్లోకి దింపాడు.

పది నిమిషాలైందో లేదో బూట్ల టకటకలు. లాఠీలు తిప్పుతూ పోలీసులు దిగారు. మార్వాడి పళ్లు పటపటలాడినై.

"గీ బద్మాషులే సార్. గిల్టు గాజులు దెచ్చి బంగారమని అమ్ముతున్నరు. నాకే టోపీ వెయ్యాలనుకున్నరు. బొక్కల పడేసి బొక్కలిరగొట్టుండ్రి దొంగనాకొడుకుల్ని" గాజుల్ని ఇద్దరి మీదికి విసిరేశాడు మార్వాడీ.

యాదగిరి, బలరాంల గుండెల్లో గజదొంగల పరుగులు.

"హమ్మ నా ముసలిముండా! ఎంతపంజేస్తివే!" అంటూ తప్పించుకోబోయిన యాదగిరి గల్లా యస్సై చేతికి చిక్కింది.

"వావెమ్మ! గిట్లెన్నడూ గాలేదురా! నమస్తే సార్." పారిపోబోయిన బలరాం జుట్టు కానిస్టేబుల్ పిడికిట్లోకొచ్చింది.

(మూసీ-అక్టోబర్ 1998)